
'ఆటా' పోటీల్లో ఎంపికైన కథ

- గోపరాజు నాగేశ్వరరావు

# ఈ కథకు ముగింపు అదే!



సెషన్సు కోర్టు కిటికిట లాడుతున్నది. కోర్టు హాలులో నిలబడేందుక్కూడా జాగా లేకా, అప్పుడు విచారణ జరుగనున్న మాలతి హత్య కేసులో వాదోప వాదాలను వినాలన్న ఉత్సుకతను ఓపలేకా చాలామంది జనం కోర్టు ఆవరణ నిండా కుదురుకున్నారు- తేనె పట్టు మీది ఈగల్లా!

అక్కడ అంత మంది జనం గుమికూడి వున్నా కనీసం వారి కదలికల అలికిడి కూడా లేదు... అంతా నిశ్శబ్దంగా వుంది.

"పబ్లిక్ కోర్ట్...!"అని లయబద్ధంగా అరుస్తూ అప్పుడు బిళ్ళ జవాను న్యాయమూర్తి ఛాంబర్లోనుంచి బైటికి వొచ్చాడు... అతగాడి ఆ అరుపు న్యాయమూర్తి రాకకు సంకేతం!

న్యాయవాదులతో సహా కోర్టు హాల్లోవున్న అందరూ లేచి నిల్చున్నారు. వినమ్రంగా చేతులు జోడించి నమస్కరించారు.

న్యాయ ంవ మూర్తి ఎంతో హుందాగా, గంభీరంగా నడచి వచ్చి ధర్మాసనం అలంకరించారు.

హాల్లోవున్న అందరి మొహాలూ ఏదో ఉత్కంఠతో జేవు రించాయి... ఇక మొదలుకానున్న మాలతి హత్య కేసు విచారణను వినే ఘడియలు రానే వచ్చాయన్న ఆసక్తితో ఉక్కిరి బిక్కిరి అవుతూ అందరూ న్యాయమూర్తి వైపే మౌనంగా చూస్తూ కూర్చున్నారు. అక్కడ క్షణమొక యుగంలా భారంగా దొర్లుతున్నది..

సంచలనం కలిగించిన మాలతి హత్య కేసు అన్ని హత్య కేసుల్లాంటిది కాదు. నేర ప్రపంచాన్ని కూడా నిర్ఘాంతపరచిన దారుణ హత్య అది!

సంఘాన్ని కత్తులతో శాసిస్తూ, నిత్యం రక్తదాహంతో తపించిపోతూ, ఇతరుల జీవితాల్లోని వెలుగుల్ని గ్రహణంలా పట్టి కబళిస్తూ... సమాజానికి భారంగా బ్రతుకుతున్న ఓ ఉన్మాది చేసిన దారుణ హత్య అది...!

మంచు తడిచిన మల్లెమొగ్గలాంటి మాలతిని అతడు ఆశించాడు. ఆ ఆశకే 'ప్రేమ'అన్న అందమైన పేరు పెట్టాడు. ఆ ప్రేమను అంగీకరించమని వత్తిడి చేసాడు.

మాలతి నిర్ద్వందంగా తిరస్కరించింది. నేరాలు చేస్తూ అవి సాహసాలు అనుకొంటూ చీడ పురుగులా సమాజాన్ని పట్టి పీడిస్తున్న అతగాడి జీవన విధానాన్ని మార్చుకోమనీ, ఇకనైనా కృషితో జీవితాన్ని మంచి దారిలో అందంగా నిర్మించుకోమనీ హితవు చెప్పింది... అదే ఆమె చేసిన నేరం!

మాలతి హితవు అతగాడికి రుచించలేదు. పైగా ఆమె హితవు హితవుకాదనీ, అహానికి చేసిన గాయమనీ భావించాడు. మత్తులో జోగుతూన్న అతగాడి అంతరంగంలోని క్రూర జంతువు మాలతి మీద కోపంతో తన పంజా కదిలించింది. ఉన్మాదం నరాలకు ఎగదట్టింది. కొబ్బరి బోండాలు నరికే కత్తిని చేత పట్టుకొని ఆమెను అంతం చెయ్యటానికి మృత్యువులా కదలి వెళ్ళాడు.

కాలేజి పరీక్ష హాల్లో ఉందప్పుడు మాలతి. పి.జి. ఫైనలియర్ చివరి పరీక్ష కూడా బాగా రాసింది. రాబోయే ఉత్తమ రాంకునూ, చేతికి అందనున్న అద్భుతమైన జీవితాన్నీ ముందుగానే ఊహించుకుంటూ తనలోతానే మురిసిపోతోంది.

మృత్యువు దాపునకు రానే వచ్చింది. అది గ్రహించలేదామె. రాసిన ఆన్సరు పేపర్లను మరోసారి చదువుతూ కూర్చుంది.

మృత్యువు ఆమె వెనుకకు చేరింది! ఆ ఉన్మాదిని అందరూ గమనించే లోగానే అతను బోండాల కత్తిని గాల్లోకి లేపాడు. అదే విసురులో ఆ కత్తి మాలతి మెడకు బలంగా తాకింది. ఆమె తల తెగిపోయి నేల వ్రాలింది. ఆర్తనాదం కూడా వినిపించే వ్యవధి కూడా లేదు. రక్తం పిచికారి చిమ్ముతూంటే ఆమె నిర్జీవ శరీరం ఆమె రాసిన ఆన్సర్ పేపర్ల మీదనే ఒరిగిపోయింది.

మాలతి చనిపోయిందని రూఢి చేసికొని ప్రపంచాన్ని జయించినంత ఆనందంగా అతగాడు తాపీగా అక్కడ్నించి వెళ్ళిపోయాడు. భయంతో అతగాడ్ని నిరోధించని అందరూ అతగాడు తన రాక్షస కృత్యాన్ని నిర్విఘ్నంగా ముగించుకొని వెళ్ళిపోయాక జడత్వంలోనుంచి చైతన్యంలోకి వచ్చారు!

ఆ సంఘటన పట్ల స్పందిస్తూ ఖండనలూ, ప్రదర్శనలూ, పత్రికల్లో పతాక శీర్షికలూ మామూలే! కాలేజి యాజమాన్యం మాలతి లాంటి అమ్మాయిలకు రక్షణ కల్పించినా, పోలీసులు తమ విధులను విధిగా నిర్వర్తించినా... కనీసం ఒక్కరంటే ఒక్కరు 'ఆ బిడ్డ నా బిడ్డే'అనుకొని ఆ ఉన్మాదిని ప్రతిఘటించినా చదువులో బ్రిలియంట్ మాలతి మనకు దక్కేది... కానీ అలా జరగలేదు. మాలతి చచ్చిపోయింది...

ధర్మాసనం మీద కూర్చున్న న్యాయమూర్తి తమ దళసరి కళ్ళద్దాల్లోనుంచి హాల్లోవున్న అందరి వైపూ ఒకసారి చూపు లు సారించి చూసేరు!

హాల్లోని జనం అందరి మొహాలూ చాలా గంభీరంగా కనిపించాయి. ఆ ఉన్మాది అయిన ముద్దాయికి ఎంత ఎక్కువ శిక్ష వేస్తే ప్రజలు అంత ఎక్కువగా సంతోషిస్తారన్నది న్యాయమూర్తి గ్రహించక పోలేదు!

నిజం చెప్పాలంటే మాలతి హత్యోదంతాన్ని వార్తలుగా పత్రికల్లో చదివిన క్షణమే న్యాయమూర్తి రక్తం కూడా సలసలా మరిగింది. భావోద్వేగంతో ఎంతగానో చలించిపోయారు. అలాంటి ఉన్మాదులను, నర రూప రాక్షసులనూ ప్రజల చేత రాళ్ళతో కొట్టించి చంపించాలన్నంతగా ఆవేశం పొంగింది... పొంగిన ఆ ఆవేశం అంతలోనే చప్పున చల్లారింది! తను కేవలం ఒక న్యాయమూర్తి మాత్రమే... చట్టం పరిధిలో విచారణ చేసి శిక్ష విధించే ఒక ఉద్యోగి మాత్రమే. తనను నడిపించేదీ, శాసించేదీ మనుషులు రాసిన చట్టం తప్ప మానవీయ స్పందనలు ఎంతమాత్రమూ కావు!

ఏం చేస్తాం! నేరస్తుడికి శిక్ష విధించటమూ, ముద్దాయిని నిర్దోషిగా విడుదల చెయ్యటమూ అన్నది ఏ కేసులోనైనా డిఫెన్సువారి టక్కరితనం మీదనున్నూ, మాటకారితనం మీదనున్నూ ఆధారపడి ఉంటుంది. పోలీసులతోనూ, ప్రాసిక్యూషన్‌తోనూ డిఫెన్సువారు లోపాయికారిగా కుదుర్చుకునే ఒప్పందాల మీద ఆధారపడి ఉంటుంది. చట్టంలోని

లొసుగుల్ని నేర్పుగా వినియోగించుకొనే డిఫెన్సువారి చాకచక్యం మీద ఆధారపడి ఉంటుంది... అవినీతి యంత్రాంగం మీదా, ఎవిడెన్సు యాక్టు డొల్లతనం మీద నన్నూ ఆధారపడి ఉంటుంది.. అంతేగాని నిజం మీద అరుదుగా కానీ ఆధారపడి ఉండదు.

హాలంతా ఒకసారి కలియచూసిన న్యాయమూర్తి చూపులు చివరికి చెక్కల బోన్లో ఉన్న ముద్దాయి మీద కేంద్రీకృతమయ్యాయి! కండలు తేలిన భారీ శరీరం అతనిది. మనసే కాదు, శరీర భాగాలన్నింటినీ లోహం కరిగించి పోతపోసినట్టే ఉంది. కదలికల్లో అసహనం, చూపుల్లో నిర్లక్ష్యం...

న్యాయమూర్తి మొహం చిట్లించుకొని ముద్దాయి వైపు నుంచి చూపులు మరలుస్తూ "ప్రొసీడ్...!"అన్నారు మంద్ర స్వరంతో.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొంతు సవరించుకొంటూ కుర్చీ లోనుంచి లేచి నిల్చుని "యువరానర్...!"అన్నాడు గంభీర కంఠంతో... అందరూ ఊపిరి బిగపట్టి అతని వైపే చూస్తున్నారు... అతను తన సహజ ధోరణిలో మాట్లాడటం మొదలుపెట్టాడు-

"యువరానర్! ఆనందరావు అనబడే ఈ ముద్దాయి తన ఏకపక్ష ప్రేమను తృణీకరించిన కారణంగా పి.జి. ఫైనలియర్ చదువుతున్న మాలతిని పరీక్ష హాల్లోనే అత్యంత దారుణంగా నరికి చంపాడు. పట్టపగలు అందరూ చూస్తుండగానే యింతటి ఘోరానికి పాల్పడ్డాడంటే ముద్దాయి ఎంత కరడుగట్టిన నేరస్తుడో కోర్టువారే గ్రహించాలి. అంతే కాకుండా ముద్దాయి స్వయంగా పత్రికల వారి ముందూ, మీడియా ముందూ నేరం తనే చేసిన విషయం అంగీకరించాడు. మిగిలిన సాక్ష్యాలను కూడా విచారించి మాలతి హత్య కేసులో నిజానిజాలను రుజువుచేసేందుకు అనుమతించవలసిందిగా కోర్టు వారిని కోరుతున్నాను"అని డిఫెన్సు న్యాయవాది వైపు రహస్యంగా చూస్తూ గుంభనంగా నవ్వేడు ప్రాసిక్యూటర్.

డిఫెన్సు న్యాయవాది చిదంబరం పెదాలు కూడా చిర్నవ్వుతో విచ్చుకున్నాయి... 'ఒప్పందాన్ని గౌరవిస్తూ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నేర్పుగా తనకు సహకరిస్తున్నందుకు కళ్ళతోనే అతడ్ని అభినందించాడు.

"ప్రొసీడ్..." అని ప్రాసిక్యూటర్ వైపు చూసేరు న్యాయమూర్తి. ఇన్స్పెక్టర్ విట్నెస్ బాక్సులోనికి వచ్చాడు. న్యాయమూర్తికి అభివాదమూ, దేవుడి ఎదుట ప్రమాణమూ చేసాడు.

"మీ పేరూ?" అతడ్ని అడిగాడు ప్రాసిక్యూటర్.

"ధనుంజయ" చెప్పాడతను.

"ఆ రోజు ఏం జరిగింది?"

"హత్య జరిగిందని వర్తమానం అందింది. వెంటనే మా సిబ్బందిని వెంట పెట్టుకొని కాలేజికి వెళ్ళాను. మాలతి శవం పరీక్ష హాల్లో రక్తపు మడుగులో కనిపించింది. పోస్టుమార్టానికి పంపించి కేసు విచారణ ప్రారంభించాను."

"బోన్లో వున్న ముద్దాయి ఆనందరావే మాలతిని హత్య చేసాడని మీ విచారణలో తేలిందా?"

"అవును".

"దట్సాల్ యువరానర్!" అని ముగించాడు ప్రాసిక్యూటర్.

"ధనుంజయ అన్నావు కదూ నీ పేరు?" క్రాస్ ఎగ్జామినేషన్ మొదలైంది. డిఫెన్సు న్యాయవాది చిదంబరం విట్నెస్ బాక్స్ చెక్కల మీద మోకాలుతో సుతారంగా రుద్దుతూ అడిగాడు.

"అవును... నా పేరు ధనుంజయ" చెప్పాడు ఎస్సై.

"ధనుంజయుడివా... 'ధనం'జయుడివా?" కోర్టు హాల్లో ఘొల్లున నవ్వులు వినిపించాయి.

"ఆర్డర్...ఆర్డర్..." న్యాయమూర్తి చెక్క సుత్తితో శబ్దం చేసారు... కోర్టు నిశ్శబ్దమైంది.

నిజానికి డిఫెన్సు లాయరు చిదంబరం సామాన్యుడు కాదు! వృత్తిలో గండర గండుడు. తిమ్మిని బొమ్మిని చేసయినా నిజాన్ని అబద్ధంగానూ, అబద్ధాన్ని నిజంగానూ నిరూపించగల సమర్థుడు. ఇప్పటి భారత రాష్ట్రపతి అబ్దుల్ కలాం కాదనీ అబ్దుల్ రజాక్ అనిన్నూ; స్వర్గీయ రాజీవ్‌గాంధీయే ఇటలీవాడు గానీ సోనియాగాంధీ భారతీయురాలే అనిన్నూ కూడా వాదించి కోర్టు వారిని ఒప్పించగలడు!



"హత్య జరిగిందని వర్తమానం అందింది. వెంటనే మా సిబ్బందిని వెంట పెట్టుకొని కాలేజికి వెళ్ళాను. మాలతి శవం పరీక్ష హాల్లో రక్తపు మడుగులో కనిపించింది. పోస్టు మార్టానికి పంపించి కేసు విచారణ ప్రారంభించాను."

అతని సామర్థ్యంమీద అందరికీ నమ్మకం ఉన్నది గనుకనే అందరూ మాలతి హత్య కేసును ఎలా మలుపు తిప్పుతాడో, నేరస్తుడ్ని కాపాడి సంఘానికి పట్టిన శనిని పొడిగిస్తాడో... ఏమో అని చెవులు రిక్కించి వింటున్నారు..

"మీరు శవాన్ని చూసినప్పుడు ముద్దాయి అక్కడే ఉన్నాడా?"

"లేడు... పారిపోయాడు"

"ఎలా దొరికాడు?"

"అతనే వచ్చి లొంగిపోయాడు"

"ఆనందరావే హత్య చేసాడని మీ విచారణలో తేలిందన్నారు కదా... ఎలాంటి విచారణ జరిపారు? హంతకుడు ఆనందరావే అన్న నిర్ధారణకు ఎలా వచ్చారూ?"

"కాలేజి సిబ్బందిని ఇతర విద్యార్థులనూ విద్యార్థినులనూ విచారించగా విషయం తెలిసింది."

"అయితే నేరం జరిగినప్పుడు చూసిన ప్రత్యక్ష సాక్ష్యులు ఉన్నారు..."

"స్వయంగా తాము చూసినట్లు ఎవ్వరూ సాక్ష్యం చెప్పటానికి ముందుకు రాలేదు."

"ఎందుకని?"

"నేరస్తుడంటే భయం!"

"అయితే మాలతి హత్య కేసులో ఐ విట్నెస్ ఎవ్వరూ లేరు"

"లేరు సార్!"

"కాలేజి సిబ్బంది, యింకా కొందరూ చెప్పిన కాకమ్మ కథలు నమ్మి ఆనందరావు హత్య చేసాడని ఒక అమాయకుడి మీద నేరాన్ని మోపి చేతులు దులుపుకున్నారు...అంతేనా?"

"లేదు సార్!"

"అంటే?"

"అవకాశాలున్నంత వరకూ విచారణ అంతా సవ్యంగానే జరిగింది సార్"

"పోనీ! ముద్దాయి దగ్గర హత్యాయుధం దొరికిందా?"

"లేదు సార్!"

"మరతను కొబ్బరిబోండాల కత్తితో మాలతిని హత్య చేసాడని రూఢిగా ఎలా చెప్పగలవూ?"

"విచారణలో వాళ్ళూవీళ్ళూ చెప్పిందాన్నిబట్టి..."

"అంతేగానీ 'మేం చూసాం' అన్నవాళ్ళు లేరు... అవునా?"

"అందరూ చూసే వుంటారు సార్! కానీ ఎవ్వరూ నిజం చెప్పేందుకు ధైర్యంగా ముందుకు రాలేదు. అయినా కట్టుదిట్టంగా విచారణ పూర్తిచేసి కేసును విజయవంతంగా ఓ కొలిక్కి తెచ్చాం... నేరస్తుడు తానే ఆ నేరం చేసినట్టు పత్రికల వారికీ, మీడియా వారిక్కూడా స్వయంగా చెప్పాడు సార్!"

"మీరు చిత్రహింసలు పెట్టి అతగాడి చేత అలా చెప్పించారు. అవును కదూ?"

"కా... కాదు సార్!" ఎస్సై తడబడ్డాడు! నటించిన ఆ తడబాటే 'ఒప్పందం' ప్రకారం డిఫెన్సుకు సహకరిస్తుంది.

"దట్సాల్ యువరానర్!" అని ముగించాడు డిఫెన్సు లాయరు. అటు తర్వాత మాలతి శవాన్ని పోస్టుమార్టం చేసిన ప్రభుత్వ ఆస్పత్రి డాక్టరు విచారణ మొదలైంది!

"పోస్టుమార్టం చేసింది మీరే కదూ?" అడిగాడు ప్రాసిక్యూటర్.

"అవును".

"ఆమె ఎలా చనిపోయింది?"

"పదునైన ఆయుధంతో నరికి చంపారు."

"పదునైన ఆయుధం అంటే?"

ఏం సమాధానం చెప్పాలో ఒక్క క్షణం డాక్టరుకే అర్థం కాలేదు. "షి వాజ్ కిల్డ్ విత్తే షార్ప్ వెపన్"అన్నాడు క్షణం తర్వాత.

"దట్సాల్ యువరానర్!"అని ముగించాడు ప్రాసిక్యూటర్... క్రాస్ ఎగ్జామినేషన్ మొదలైంది...

"ముద్దాయి బోండాలు నరికే కత్తితోనే హత్య చేసాడని ప్రాసిక్యూషన్ వారు ఘంటాపథంగా చెబుతున్నారు... హత్యకు వినియోగించిన ఆయుధం బోండాల కత్తే అని చెప్పగలరా మీరు?"అడిగాడు డిఫెన్సు లాయర్ చిదంబరం.

"అలా రూఢిగా చెప్పలేము... పదునైన ఆయుధం అని మాత్రమే చెప్పగలం..."

"దట్సాల్ యువరానర్!"అన్నాడు చిదంబరం. షెడ్యూలు ప్రకారం ఆనాటి కోర్టు తతంగం ముగిసిపోయింది. మరుసటి రోజుకు విచారణ వాయిదా పడింది.

* * *

కోర్టు ప్రారంభంకాగానే ప్రాసిక్యూటర్ క్లుప్తంగా తన వాదన కోర్టు వారికి వినిపించిన మీదట డిఫెన్సు న్యాయవాది చిదంబరం (మిగతా 12వ పేజీలో)

